భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0



దుర్గాదేవిగా యల్లారమ్మ

శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మ వార్లను దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. మండపాక యల్లారమ్మను దుర్గాదేవిగా అలంకరించారు..

చిన వెంకన్న కొండపై బ్రహ్మోత్సవ శోభ



రేపటి నుంచి తిరు కల్యాణోత్సవాలు

6వ తేదీ రాత్రి శ్రీవారి కల్యాణం.. 7న రథోత్సవం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల శేషాచలంపై కొలువుదీరిన చినవెంకన్న ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమై 9 వరకు వైఖానస ఆగమయుక్తంగా జరగనున్నాయి. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికు మార్తెలుగా చేస్తారు. 3న ధ్వజారోహణ, 5 రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 6 రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 7న రాత్రి 8 గంటలకు రథోత్సవం, 8న శ్రీచక్ర వార్యుత్సవం, ధ్వజావరోహణ జరుగుతుంది. 9న ఉదయం 9గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి జరిగే ద్వాదశకోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 2 నుంచి 9వ తేదీ వరకు నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

వాహన సేవలిలా..

బ్రహ్మోత్సవ సమయంలో స్వామి, అమ్మవార్లకు నిత్యం జరిగే వాహన సేవల నిమిత్తం వివిధ రకాల వాహనాలను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. రోజుకో వాహనంలో అమ్మ వార్లతో కలసి శ్రీవారు వివిధ అలంకారాల్లో ఊరేగుతూ పురవీధుల్లో భక్తులను కటాక్షించనున్నారు. 2వ తేదీ రాత్రి 7గంటలకు గజవాహనంపై శ్రీవారి తిరువీధిసేవ, 3వ తేదీ రాత్రి 9 గంటలకు హంస వాహనంపై, 4వ తేదీ ఉదయం 7 గంటలకు సూర్యప్రభ, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవం, 5వ తేదీ ఉదయం 7 గంటలకు హనుమ ద్వాహనంపై, 6న రాత్రి 8 గంటలకు శ్రీవారి కల్యాణం, వెండి గరుడ వాహనాలపై, 7వ తేదీ రాత్రి 8 గంటలకు రథవాహనంపై శ్రీ వారి తిరు వీధిసేవ, 8వ తేదీ రాత్రి 9 గంటల అనంతరం అశ్వవాహన సేవ ఉంటాయి.



ఏలూరు బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):దసరా పండుగను ఇంటి వద్ద జరుపుకునేందుకు హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రజలు తరలివస్తుండడంతో ఆర్టీసీ నాలుగు ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి రెగ్యులర్‌గా వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల టికెట్లు పూర్తి కావడంతో మరో నాలుగు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేశారు. ఒకటో తేదీన హైదరాబాద్ నుంచి ఏడు సర్వీసులు నడుపుతారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ ట్రావెల్స్ టిక్కెట్‌కు రూ.2 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నారు.

దసరా సందడి.. మార్కెట్లు రద్దీ

షాపుల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. జీఎస్టీ తగ్గించడంతో ఎలక్ట్రానిక్స్ పరికరాల షాపులు, వాహనాల షాపులు కిటకిటలాడుతున్నాయి. మొన్నటి వరకు అంతంత మాత్రంగా ఉన్న వ్యాపారాలు దసరా పండుగతో పుంజుకున్నాయి. దసరాకు మోటర్ సైకిళ్లు, కారులు, ఇతర వాహనాల కొనుగోళ్లను ప్రజలు సెంటిమెంట్‌గా భావిస్తారు. అందుకు తగ్గట్టుగానే అయా కంపెనీ షోరూంలు తగ్గింపు ధరలతో వాహనాల అమ్మకాలను జరుపుతున్నాయి.



ఏలూరులో ధర్నా చేస్తున్న వైద్యులు

వైద్యుల సమ్మెబాట

భీమవరం టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్‌లను పరిష్కరించేందుకు వైద్య శాఖ ఉన్నతాధికారులు ససేమిరా అనడంతో తప్పని పరిస్థితుల్లో రాష్ట్ర పీహెచ్‌సీ వైద్యుల సంఘం సమ్మె బాట పట్టింది. న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగించనున్నారు. అందులో భాగంగానే మంగళవారం జిల్లాలోని 32 పీహెచ్‌సీలకు వైద్యులు హాజరుకాలేదు. దీంతో రోగులకు వైద్యసేవలు అందలేదు. సమ్మెలో భాగంగా బుధవారం 'చలో డీఎంహెచ్‌వో కార్యాలయం' పేరిట ఆందోళన చేపట్టనున్నారు. వైద్యులు ప్రదర్శనగా కలెక్టరేట్‌లో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలపనున్నారు.

అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జిల్లాలోని 32 పీహెచ్‌సీల్లోని వైద్యులు సమ్మెబాట పట్టడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఏరియా ఆసుపత్రుల్లో అదనంగా వున్న వైద్యులను పీహెచ్‌సీలకు నియమించినట్టు తెలుస్తోంది. అయితే వీరు కూడా ఆందోళనకు మద్దతు ఇస్తున్నారని, ఈ క్రమంలో వారు బాధ్యతలు తీసుకుంటారా..? అన్న దానిపై నేడు స్పష్టత రానుంది.

కొత్త టీచర్లకు నాలుగు కేంద్రాల్లో ఇండక్షన్ ట్రైనింగ్

▸▸ 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ శిబిరం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారికి అక్టోబరు 3నుంచి 10వ తేదీ వరకు ఇండక్షన్ ట్రైనింగ్ నిమిత్తం ఉమ్మడి జిల్లాలో కేంద్రాలను ఖరారు చేసినట్టు డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ విధానంలో జరిగే శిక్షణ తరగతులకు సంబంధిత ఉపాధ్యాయులందరూ కచ్చితంగా హాజరు కావాల్సిందేనని ఆదేశించారు. శిక్షణకు హాజరై, పూర్తిచేసుకున్న వారికి మాత్రమే పాఠశాలల్లో విధులు చేపట్టేందుకు పోస్టింగ్స్ ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. శిక్షణకు హాజరయ్యే వారు తమ వెంట దైనందిన అవసరాలకు సరిపడా దుస్తులు, బెడ్‌షీట్స్, ఉదయం జాగింగ్‌కు రన్నింగ్ షూస్, ఆండ్రాయిడ్ ఫోన్లు, తదితర అన్ని వస్తువులను వెంట తెచ్చుకోవాలని, అనారోగ్యంతో వున్నవారు శిక్షణ పూర్తయ్యేవరకు సరిపోయేలా మందులను తెచ్చుకోవాలని, శిక్షణ శిబిరానికి ఫార్మల్ డ్రెస్‌కోడ్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందన్నారు.

శిక్షణ వేదికలివే..

- స్కూల్ అసిస్టెంట్స్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతం, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టుల టీచర్లకు భీమవరం గొల్లలకోడేరు రోడ్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూలు.
- స్కూల్ అసిస్టెంట్స్ సోషల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు నరసాపురం, సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల.
- సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)కు తణుకు ఓల్డ్ టౌన్ ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల. భీమవరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సీఎస్ఎన్ డిగ్రీ కళాశాల.

కాఫీతో.. శుభోదయం



కా..ఫీ.. అంటే కాస్త ఫీలింగ్. ఉదయాన్నే పొగలు కక్కే చిక్కటి కాఫీ రుచి చూడనిదే చాలా మందికి తెల్లారదు. నాలుకపై కాఫీ నర్తించనిదే మంచంపై నుంచి కాలు కిందకు దిగదు. రోజు రీ ఫ్రెష్ కావాలంటే.. బెడ్ కాఫీ పడాల్సిందే అనేవారు ఎందరో..! అలాంటి కాఫీతోనే గోదావరి జిల్లా మర్యాద మొదలవుతుంది. మత్తు పానీయం మాదిరి కాఫీ కూడా వ్యసనమే అయినప్పటికి ఇది చేసే మేలు తక్కువేమీ కాదు. నేడు ఇంటర్నేషనల్ కాఫీ డే సందర్భంగా.. మనమూ కాఫీ రుచిని ఆస్వాదిస్తూ.. దీని వెనుక కథను తెలుసుకుందాం.

(పాలకొల్లు-ఆంధ్రజ్యోతి)

'అయ్యయ్యో.. అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారే మీటండి.. కాస్త కాఫీ అయినా తాగి వెళ్లండి'.. ఇదీ గోదావరి జిల్లాల్లో ఇంటికి వచ్చిన అతిథులకు ఇచ్చే మర్యాద. అలాంటి కాఫీ వెనుక పెద్ద చరిత్రే వుంది. ఇది వరకు కాఫీ అంటే ఫిల్టర్ కాఫీ ఒక్కటే. అంత సమయం లేదండీ.. అనుకునే వాళ్లంతా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులను ఆస్వాదిస్తుంటారు. ఇప్పుడు ఎన్నో రకాలొచ్చేశాయి. బ్లాక్ కాఫీ, కోల్డ్ కాఫీ, చాక్లెట్ కాఫీ.. ఇంకా చాలా ఉన్నాయ్. ఓసారి కాఫీ డేకో, కాఫీ షాప్‌కో వెళితే ఇన్ని కాఫీలు ఉన్నాయా ? అని ఆశ్చర్యపోవడం మనవంతవుతుంది..

జీవితంలో కాఫీ.. ఒక భాగం



తెల్లవారుజామునే లేచి కాఫీ పెట్టుకుని తాగుతా. ఆ తర్వాతే ఇంటి పనులు చేసుకుంటా. ఇప్పుడు నా వయసు 73 ఏళ్లు. 53 ఏళ్లుగా కాఫీ తాగుతున్నా. అప్పట్లో కాఫీ గింజలను ఆడించి అమ్మేవారు. మంచి సువాసనతో ఉండేది. ఇప్పుడంతా రెడీమేడ్ వచ్చాయి.. అప్పటి రుచి ఇప్పుడు కుదరడం లేదు.. వేరు ఊరు వెళ్లినా కాఫీ అంత సంతృప్తిగా ఉండదు. ఎందుకంటే సొంతూర్లో పాడి గేదె పాలతో పెట్టిన కాఫీ రుచే వేరు.

- శింగులూరి అన్నపూర్ణ, తెల్లంవారిగూడెం

కాఫీ కోసం టూర్ మధ్యలో వచ్చేశా !



చిన్నప్పటి నుంచి కాఫీ అంటే ఎంతో ఇష్టం. కాఫీ లేనిదే రోజు ప్రారంభం కాదు. ఒకవేళ బయటకు వెళ్లినా కాఫీ కోసమే రాత్రికి ఇంటికి వచ్చి తీరాల్సిందే. ఒకసారి టూర్‌కి వెళ్లిన సమయంలో కాఫీ సమస్య తలెత్తింది. ఎక్కడా కాఫీ దొరక్కపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాను. చివరికి కాఫీ కోసమే ఆ టూర్ మధ్యలోనే వచ్చేశాను. తరవాత ఎక్కడికి వెళ్లినా కాఫీ పొడి వెంటపెట్టుకుని వెళుతుంటా.

- గమిడి మల్లికార్జునరావు, నీలాద్రిపురం

కాఫీ పుట్టింది ఇలా..

కాఫీ చెట్ల నుంచి లభించే గింజలను శుద్ధి చేసి ఎండబెట్టి, పొడి చేసి కాఫీ తయారీకి వినియోగిస్తారని తెలిసిందే. అనేక దేశాల్లో కాఫీ పంటను సాగు చేస్తుండగా, అరకు మన్యంలో కాఫీ సాగు ఎప్పుడో మొదలైంది. నిజానికి ఇతర దేశాల్లో కాఫీ గింజలను వేయించి, పొడి చేసి దాన్ని నీటితో మరిగించి, ఆ నీటిని వడగట్టి కాఫీ డికాక్షన్ తయారు చేసి పంచదారను చేర్చి తాగేవారు. మనవాళ్లు మాత్రం కాఫీ డికాక్షన్‌కు పాలను చేర్చి చిక్కటి కాఫీ తాగడం కొత్త అలవాటు. ఇక వేడి వేడి పొగలు కక్కే కాఫీ తాగడం పాత సంప్రదాయం. చల్లని ఐసు ముక్కలతో కూడిన కోల్డ్‌కాఫీలను ఆస్వాదించడం కొత్త అలవాటు. అయినా ఎవరి టేస్టు వారిది.. ఎవరి ట్రెండ్ వారిది.

రోజుకు పది లక్షల మంది సేవిస్తారు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిత్యం కాఫీని ఆస్వాదించేవారు 10 లక్షలకు పైమాటే. ప్రతీ నలుగురిలో ఒకరు ఉదయాన్నే కాఫీని ఆస్వాదిస్తారు. కాఫీలో నాడీ వ్యవస్థను ఉత్తేజపరిచే కెఫెన్ అనే పదార్థం ఉండటం కారణంగా కాఫీ తాగిన వారిలో ఒక రకమైన ఉత్తేజం కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మూడు బిలియన్ల మంది నిత్యం కాఫీని సేవిస్తారు. ఇథియోపియాలో తొలిసారి 870వ సంవత్సరంలో కాఫీ గింజలను ఉపయోగించారు. మనదేశంలో ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచలప్రదేశ్, త్రిపుర, మిజోరాం, అసోం, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాలలో మూడో వంతు కాఫీ గింజలను ఉత్పత్తి చేస్తున్నారు. కేరళలో 21 శాతం కాఫీ పండిస్తుండగా కర్ణాటకలో 71 శాతం అత్యధికంగా కాఫీ తోటలు ఉన్నాయి. ఇక మన రాష్ట్రంలో అరకు ప్రాంతంలోని కాఫీ ఉత్పత్తికి జాతీయస్థాయి అవార్డు వచ్చింది. ప్రధాని మోదీ సైతం అరకు కాఫీ రుచి చూసి అబ్బురపడ్డారు. ఈ కాఫీకి ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంది. అందులోనూ కావేరీ రకం కాఫీకి చాలా డిమాండు ఉంది. గిరిజన సహకార సంస్థ అరకు బ్రాండ్ పేరుతో ఈ కాఫీ పొడిని మార్కెట్ చేస్తోంది. కాఫీ గింజలు పండించే రైతులకు మద్దతును ఇస్తూ కాఫీ ప్రేమికులు తొలిసారిగా 2015 అక్టోబరు 1న వరల్డ్ కాఫీ డే నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా దీనిని నిర్వహిస్తున్నారు.

కాఫీ కప్పు స్పెషల్

కాఫీకి ఎంత గుర్తింపు ఉందో అది తాగే కప్పుకీ అంతే క్రేజ్. పూర్వం ఇత్తడి చెంబుల్లో తాగేవారు. తర్వాత మట్టి, స్టీలు, గాజు, పింగాణీ కప్పులు.. కప్పు సాసర్లలో కొంత కాలం.. ఇప్పుడు కాఫీ కప్పులంటేనే వేలల్లో మోడళ్లు. కాఫీ తాగాలంటే తనకంటూ సొంతంగా ఓ కప్పు ఉండి తీరాల్సిందే. రుచిగా కాఫీ తాగడమే కాదండోయ్..తాగే కప్పు ప్రత్యేకమేనని కాఫీ ప్రియుల ఫీలింగ్.

పాలతో కాఫీ బెటర్

గోదావరి జిల్లాల్లో 90 శాతం మందికిపైగా కాఫీ ప్రియులు కాఫీ పొడిని పాలతో కలిపి సేవిస్తుండగా తక్కువ సంఖ్యలో బ్లాక్ కాఫీ తాగుతున్నారు. ఆరోగ్య రక్షణ చర్మ సౌందర్యం పేరుతో సంపన్న వర్గాలలో ఐదు శాతం బ్లాక్ కాఫీనే సేవిస్తున్నారు. కాఫీ తాగే వారిలో జుట్టు నిగారింపు ఉండటమే కాకుండా చర్మం బిగుతుగా ఉంటుందని కాఫీ ప్రియులు విశ్వసిస్తారు. శరీరంపై నల్ల మచ్చలు ముఖంపై మొటిమలు తగ్గుతాయని, ముఖ కదలికల్లో ఎప్పుడు నూతనోత్తేజం కనిపిస్తుందని కాఫీ ప్రియులు విశ్వసిస్తారు. అయితే అధికంగా సేవిస్తే ఎసిడిటీతో పాటు పలు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మితంగా సేవిస్తే మంచిదే..!

బెల్లం శొంఠి కాఫీతో ఆరోగ్యం

కాఫీలు పలు రకాలు. పూర్వం శొంఠి బెల్లం కాఫీ ఒకటి. వంటింట్లో లభించే సుగంధాలతోనే దీన్ని తయారు చేయడంలో మన అమ్మమ్మలు, నానమ్మలు సిద్ధహస్తులు. 20 గ్రాముల శొంఠిపొడి, 10 గ్రాముల మిరియాల పొడి, 10 గ్రాముల బెల్లం పొడి తీసుకోవాలి. రెండు కప్పుల నీరు గిన్నెలో పోసి స్టౌవ్‌పై పెట్టి దాన్ని మరిగించి శొంఠి, మిరియాల మిశ్రమాన్ని వేసి మరిగించాలి. ఐదు నిమిషాలలోపు మరిగించి దానిని వడిగట్టి మరొక గిన్నెలో వేయాలి. రెండు కప్పుల పాలను తీసుకుని స్టౌవ్‌పై మరిగించి దానిని దించే ముందు శొంఠి ద్రావణాన్ని పాలలో వేసి వెంటనే బెల్లం పొడి వేసి కలిపి స్టౌ కట్టేసి దాన్ని దించి గ్లాస్‌లో తొరిపి తాగేయడమే...ఈ కాఫీ తాగడం వల్ల దగ్గు. జలుబు, శ్వాస సమస్యలు తగ్గుతాయని, జీర్ణశక్తి పెరుగుతుందని చెబుతారు మరి.

కాఫీ ప్రియులకో క్లబ్ !

భీమవరం టౌన్(ఆంధ్రజ్యోతి): భీమవరంలో పలువురు కాఫీ ప్రియులు కలసి కాఫీ క్లబ్ ఏర్పాటు చేసుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచనే మార్నింగ్ కాఫీ క్లబ్ ఏర్పాటు అయింది. 2021 మార్చి 12న 50 మంది సభ్యులతో క్లబ్ ప్రారంభమైంది. డీఎస్ఆర్ కళాశాల గన్నాబత్తుల వారి ఆటస్థలంలో క్లబ్ సభ్యులు అప్పటినుంచి ప్రతీరోజు ఉదయం కలుసుకుంటారు. కాఫీ తాగుతూ ఆరోజు కాఫీ కలిపిన కాఫీ బాయ్‌ను సత్కరించడం అనవాయితీగా వస్తోంది. కాఫీ రుచిన ఆస్వాదీస్తు క్లబ్ తరుపున చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలను నిర్ణయించుకుంటారు. క్లబ్ ఫౌండర్, కన్వీనర్‌గా బొండా రాంబాబు, కో-కన్వీనర్‌గా ఓలేటి శ్రీను, పీఆర్‌వోగా భట్టిప్రోలు శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు.





సమావేశంలో పాల్గొన్న మంత్రి వర్మ, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి, బొలిశెట్టి, అంజిబాబు, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ నాగరాణి , జేసీ రాహుల్ తదితరులు

పథకాల అమలుతోనే జిల్లా సమగ్రాభివృద్ధి

అధికారులు చిత్తశుద్ధితో పనిచెయ్యాలి : కేంద్ర మంత్రి వర్మ

జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

భీమవరం టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):పథకాల అమలు ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(డీడీఆర్‌సీ) సమావేశం జరిగింది. ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ, ఉద్యాన శాఖ, పౌరసరఫరాలు తదితర శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తోందని వాటి ఫలాలు ప్రజలకు చేరాలంటే అధికారులు క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి కోరారు. భీమవరం యనమదుర్రు డ్రైన్‌పై అసంపూర్తి నిర్మాణంలో ఉన్న మూడు వంతెనలు అప్రోచ్ రోడ్లు పూర్తి చేయవలసి ఉందని దీనికి రూ.36 కోట్లు ఖర్చు అవుతుందని ఎమ్మెల్యే అంజిబాబు చెప్పారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ప్రస్తావించానని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

తాడేపల్లిగూడెం, తణుకు ఎమ్మెల్యేలు బొల్లినేని శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రోడ్ల గోతులు పూడ్చడంతో ప్రయోజనం లేదని సింగిల్ లేయర్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్స్, ర్యాలీలు, వర్క్‌షాప్‌లు సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కరపత్రాన్ని కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌వో బి.శివన్నారాయణ రెడ్డి, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

రూ.1,735 కోట్లతో జలజీవన్ పనులు

జిల్లాలో చేపట్టిన జలజీవన్ మిషన్ పనుల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారి వివరిస్తూ జిల్లాలో రూ.1,735 కోట్ల అంచనాతో 1,489 పనులు మంజూరు చేశారన్నారు. వీటిలో రూ.1,400 కోట్లను వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు కేటాయించారన్నారు. దీనికి అవసరమైన స్థల సేకరణను విజ్జేశ్వరం వద్ద పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు జేజేఎం కింద రూ.100.83 కోట్లు ఖర్చు చేసి 877 పనులను పూర్తి చేసినట్టు వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు తీరును డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు యూరియా కొరత లేదని, రైతులు కోరిన విధంగా సరఫరా చేశామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగంలో డ్రోన్లు వినియోగంలో మన జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపు వ్యవసాయ రంగానికి మరింత ఊతం



సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్ నాగరాణి

రైతాంగాన్ని ప్రోత్సహించే దిశగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు, పనిముట్లపై భారీ మొత్తంలో జీఎస్టీ తగ్గింపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మరింత అండగా నిలిచాయని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం భీమవరం మునిసిపల్ కార్యాలయం వద్ద లూథరన్ పాఠశాల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహనలో భాగంగా వ్యవసాయ రంగంలో చేకూరిన ప్రయోజనాలపై అవగాహన కలిగించేందుకు పెద్దఎత్తున నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ప్రారంభించారు. మంత్రి వర్మ స్వయంగా ట్రాక్టర్ నడిపి ఉత్సాహపరిచారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా వినియోగదారులకు చేకూరుతున్న ప్రయోజనాలను తెలియచెప్పేందుకు దసరా నుంచి దీపావళి వరకు దేశవ్యాప్తంగా ప్రచారం చేపట్టినట్టు మంత్రి వివరించారు. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు కారణంగా ప్రతి ఒక్క కుటుంబానికి నెలకు మూడు నుంచి ఐదు వేల రూపాయల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట లభించిందన్నారు. ట్రాక్టర్ల ర్యాలీలో కలెక్టర్ స్వయంగా ట్రాక్టర్‌ను నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు.



ముంచుకొస్తున్న గోదావరి

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం/పెనుగొండ/ఆచంట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):గోదావరికి వరద ముంచుకొస్తోంది. మంగళవారం ఉదయం భద్రాచలం వద్ద 48.70 అడుగుల నీటిమట్టం నమోదుకాగా సాయంత్రానికి 50 అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో వరదనీరు కిందకు వెళ్లలేక వేలేరుపాడు మండలంలోని పల్లపు ప్రాంతాల వరకు వరద భారీగా చేరుతోంది. దీంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని పలు రహదారులు నీటమునిగాయి. మిరపపంట వరదలో మునిగిపోవడంతో రైతులకు భారీగా నష్టం ఏర్పడింది. పాత పోలవరం కడెమ్మ వంతెనకు సమాంతరంగా వరద జలాలు ప్రవహిస్తున్నాయి. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద నీటితో వశిష్ట పోటెత్తుతోంది. రెండు రోజుల నుంచి సుమారు ఏడు అడుగులు మేర వరద నీరు పెరిగింది. సిద్ధాంతం కేదార్ ఘాట్,పుష్కర ఘాట్‌ల మెట్లను దాటి వరద ప్రవహిస్తోంది. ఆచంట మండలం పుష్కర ఘాట్‌లు నీట మునిగాయి. గోదావరిలో పడ వల రాకపోకలు నామమాత్రంగా తిరుగుతున్నాయి.

ఇద్దరికి లూసీ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇరువురు వ్యాధిగ్రస్తులకు లూసీ చారిటబుల్ ట్రస్ట్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించినట్టు ట్రస్ట్ ఎం.యోషయా, డైరెక్టర్ ఎం.రాజేష్ తెలిపారు. రుస్తుంబాదకు చెందిన గొలుసు రాముకు, కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన మొండి జ్ఞానేశ్వరరావు అనే వృద్ధుడికి ట్రస్టు ద్వారా ఇరువురికి రూ.10వేలు చొప్పున మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి అందించారు. ట్రస్టు సభ్యులు కట్ట సుధాకర్, ఎం.విజయ కుమార్, కె.ఏసు రత్నం ఉన్నారు.



కప్పు మనదే పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

పాకిస్థాన్‌పై భారత్ అద్భుత విజయం

భీమవరంటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై టీమిండియా అద్భుత విజయం సాధించిందని, ఈ చారిత్రక గెలుపుతో క్రీడాభిమానులు దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ మెగా ఫ్యాన్స్ అధ్వర్యంలో మంగళవారం 'కప్పు మనదే' పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీమిండియా పోరాట స్ఫూర్తి, నైపుణ్యం, సంయమనం ప్రదర్శించిందని, ఒక్క ఓటమి కూడా లేకుండా చాంపియన్స్‌గా నిలిచిందన్నారు. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మకు అభినందనలని, ప్రతి భారతీయుడికి ఇది గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో గూండా జయప్రకాష్, కోళ్ల నాగేశ్వరరావు, చల్లా రాము, కొప్పినీడి బాబి, పళ్ల ఏసుబాబు, యాస అనిల్, కొట్లు నాగేశ్వరరావు, ఇందుకూరి శివాజీ వర్మ, అల్లు శ్రీనివాస్, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ వెంకటపతిరాజు దంపతులకు సన్మానం

ఆచంట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచంట సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందిన కె. వెంకటపతిరాజు దంపతులను మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లాలో పలువురు సబ్ రిజిస్ట్రార్‌లు ఉద్యోగులు దస్తావేజు లేకర్లు వారి బంధువులు పలువురు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్‌గా రాజు చేసిన సేవలను పలువురు వ్యక్తులు కొనియాడారు.

అమ్మా.. దుర్గమ్మ..



తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో కుంకుమ పూజలు



జీలుగుమిల్లిలో అమ్మవారి ఆలయంలో చిన్నారులు



ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, పెనుగొండలో వాసవీ మాత, వెండి అలంకరణలో పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ, వనదుర్గగా దర్శనమిచ్చిన తాడేపల్లిగూడెం బలుసులమ్మ

భీమవరం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సామూహిక కుంకుమ పూజలు, సహస్ర నామార్చన నిర్వహిస్తున్నారు. పలుచోట్ల వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరాలయంలో పార్వతీదేవి, పెనుగొండ వాసవీ మాత దుర్గాదేవిగా భక్తులను కరుణించారు. తాడేపల్లిగూడెం బలుసులమ్మ వన దేవతగా దర్శనమిచ్చారు.

ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మ మంగళవారం భక్తజనులకు శ్రీదుర్గాదేవిగా దర్శనభాగ్యాన్ని కల్పించారు. సింహ వాహనాన్ని అధిరోహించి, అష్టభు జాలతో, ఆయుధ దారిణియై, ఉగ్రరూపంలో ఉన్న కుంకుళ్లమ్మను పలువురు భక్తులు దర్శించి తరించారు. ఉగ్రరూపంలో ఉన్నా భక్తులపై కరుణ కురిపించే అమ్మను దర్శిస్తే దుర్గతుల నుంచి తప్పించుకో వచ్చన్నది భక్తుల నమ్మకం.



జువ్వలపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ డాక్టర్ భార్గవిసత్య

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

కాళ్ళ, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు తమ పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ డాక్టర్ కె.భార్గవి సత్య తెలిపారు. కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామంలో మంగళవారం గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పలు పాడి పశువులకు ఆమె టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వైరస్ వల్ల వస్తుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులకు జ్వరం, నోటి నుంచి చొంగరావడం, కాలిగిట్టలకు పుండ్లు, నీరసించి పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అదేవిధంగా పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. సకాలంలో వైద్యం అందించకపోతే వ్యాధి తీవ్రత పెరిగి పశువు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు 15 వరకు ప్రతి గ్రామంలోనూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మైక్రో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

కాళ్ళ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజలందరికీ స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నానని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్ల మండలం బొండాడపేటలో రూ. 10 లక్షల నిధులతో నిర్మించిన ఐదు లక్షల లీటర్ల కెపాసిటీ గల మైక్రో ఫిల్టర్‌ను తనయుడు భరత్‌వర్మ, కెనరా బ్యాంక్ సిబ్బందితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 25 మైక్రో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకురావడం శుభపరిణామమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడ్ల మధుసూదనరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆరేటి వెంకటరత్నప్రసాద్, డీసీ ఛైర్మన్లు గోకరాజు వెంకట శివరామరాజు, తోట ఫణిబాబు, దాసరి వెంకటరామరాజు, ఉద్ధరాజు శ్రీనివాసరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాసరావు, ఏఈ ఫణి, పంచాయతీ కార్యదర్శి మణికంఠ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ శ్రేణులు

పని గంటల పెంపు నిర్ణయం తగదు

ఆకివీడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు రోజుకు పదమూడు గంటలు పనిచేసేలా అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరిశ్రమలలో సౌకర్యాలు లేక కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. కార్మికులకు రక్షణ లేకుండా పనులు చేస్తుంటే పని గంటలు పెంపు విధానాన్ని చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు పెంకి అప్పారావు, బొర్రా శ్రీను, నెల్లి సూరిబాబు, మనోహర్, తోట పద్మ, కన్యాకుమారి, అప్పలనాయుడు, ప్రవీణ్, నాగమణి, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి

» 73 మందికి రూ.35 లక్షల చెక్కుల పంపిణీ : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని ప్రతీ ఒక్కరూ ఆశీర్వదించాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి నియోజకవర్గంలోని పేదలు వైద్య ఖర్చుల నిమిత్తం 73 మందికి రూ.35 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. గతంలో జగన్ పాలనలో సీఎంఆర్‌ఎఫ్ నిధులను సైతం పక్కదారి పట్టించారన్నారు. పేదలకు వైద్యం దూరం చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో పాలకొల్లు నియోజకవర్గంలో రూ7.5 కోట్లు పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందజేయడం జరిగిందని మంత్రి నిమ్మల వివరించారు.ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బి సోమశేఖర్, ఎం ఫకీర్ బాబు, వట్టం గణేష్, తులా రామలింగం, శిడగం సురేంద్ర, కొమ్ముల దినేష్, పినిశెట్టి శ్రీనివాస్, విన్నకోట గోపి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

19 వరకు జీఎస్‌టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం

భీమవరంటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీఎస్‌టీ తగ్గింపుపై ఈనెల 19వ తేదీ వరకు 'సూపర్ జీఎస్‌టీ, సూపర్ సేవింగ్స్'పై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని, జీఎస్టీ తగ్గింపుపై ప్రతి కటుంటుంబానికి తెలియజేస్తున్నామని జీఎస్టీ ఆఫీసర్‌లు వి.రాజేష్ కుమార్, కె.గంగాధర్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో జీఎస్టీ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపునకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే కలక్టరేట్, కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో సంప్రదిం చవచ్చని అన్నారు. ప్రజలకు జీఎస్టీ 2.0తో ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రజలు నిత్యం వినియోగించే నిత్యావసర సరుకులపై జీఎస్టీ తగ్గింపుతో ఏ మేరకు లబ్ధి కలుగుతుందోనని ప్రతీ కుటుంబానికి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్య, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది శైలజ, ఇందిరా, సబ్బీర్, సతీశ్, నారాయణ, శివ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మన ఆచార వ్యవహారాలు చెరగని ముద్రలు'



విల్లంబులతో దసరా సంబరాలు

భీమవరంటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మన ఆచార్య వ్యవహారాలు చెరగని ముద్రలని, ప్రాచీన సంస్కృతి పండుగలు విషయాలపై పెద్దలు, పిల్లలకి చెప్పాల్సిన అవసరం ఉందని పెయింటర్స్ అండ్ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని సత్యనారాయణ, కార్యదర్శి పొన్నా రంగారావు, ఉపాధ్యక్షుడు జ్యోసుల మల్లికార్జునరావు, శివాజీరావు అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'దసరా విజయీభావ శోభాయాత్ర' శ్రీరాంపురం రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి పట్టణ వీధుల్లో సాగింది. దసరా విజయీభావ శోభాయాత్ర అందరి ఇంటా విజయం చేకురాలని, పూర్వీకులు ఈ సంప్రదాయాన్ని నెలకొల్పారన్నారు. చిన్నారులు విల్లంబులతో దసరా పద్యాలతో వీధివీధినా తిరుగుతూ మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడం ఒక శుభపరిణామమన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మన సంప్రదాయాలు ఏనాటికీ చెరగని ముద్రల ధరిత్రలో నిలుస్తాయన్నారు. ఆలయ అర్చకులు బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం, ప్రసాద్, వై.నాగమణి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



బేంబూతో తయారు చేసిన సోఫా, కుర్చీలు

వెదురు ఆదాయ వనరు

రూ.లక్ష సబ్సిడీతో రైతులకు వెదురు పెంచే అవకాశం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బేంబో ఈ పేరు వింటే మారేడుమిల్లి.. అరకు తదితర అటవీ ప్రాంతాల్లో లభించే బేంబో చికెన్ గుర్తుకొచ్చే ఉంటుంది. కానీ బేంబో (వెదురు) ఇటు ప్రకృతి వరప్రసాదంతో పాటు రైతులకు మరెంతో ఆదాయం అందించే వనరుగా ప్రసిద్ధి. పూర్వం పంట చేల వద్ద ఈ వెదురు తరచూ కనిపించేది. కానీ ప్రస్తుతం ఆ వెదురు కానరావడం లేదు. ప్రకృతి ముఖ్యంగా వాతావరణ సమతుల్యత దెబ్బతినడం తోపాటు భూభాగం కొట్టుకుపోతోంది. వెదురు అదృష్టంగా స్వచ్ఛమైన గాలి కోసం ఉపయోగిస్తుంటారు. దీన్ని పరిరక్షించేందుకు దీని ఆవశ్యత తెలిపేందుకు ప్రపంచ వెదురు దినోత్సవం ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 18న నిర్వహిస్తున్నారు. ఈ వెదురును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.లక్ష సబ్సిడీ అందిస్తోంది. దీని ద్వారా ఎన్ని లాభాలు ఉన్నాయో తెలుసుకుందాం..

వెదురుతో పచ్చని ప్రకృతి..

వెదురు చెట్ల వల్ల ప్రకృతి ముఖ్యంగా వాతావరణ సమతుల్యత కాపాడుతుంది. దీనికి తోడు భూభాగం వర్షాలకు, వరదలకు కొట్టుకుపోకుండా కాపాడుతుంది. గతంలో బోదె గట్లు, చేల గట్లు, చెరువు గట్ల వెంబడి ఈ వెదురు వేయడం ద్వారా గట్టు పటిష్టత పరిచేవారు. కాల క్రమేనా ప్రస్తుతం ఆ వెదురు చెట్లు ఉండడంలేదు.. చెరువులు కానరావడంలేదు.

వాణిజ్య లాభాలు..

వెదురు వల్ల నిర్మాణ రంగంలో, కాగితం, వస్త్రాల తయారీ, ఔషధాల తయారీ, సంగీత వాయిద్యాల తయారీ, ఫర్నిచర్, ఇతర హస్తకళలకు ఈ వెదురే ఆధారం. వాటితోపాటు ఇళ్లనిర్మాణం కలిగిన వారి ఇళ్ల వద్ద అధిక ధరకు ఈ వెదురు కొనుగోలు సాగిస్తున్నారు. బేంబూ నర్సరీ కోసం సబ్సిడీ వెదురు విత్తనాలు వేసుకుని వెదురు పెంచడంతోపాటు విక్రయించడానికి ఆసక్తిగల యువత కోసం ప్రభుత్వం లక్ష సబ్సిడీతో అందిస్తోంది. దీనికి ఆసక్తిగల యువతకు ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలో శిక్షణ అంది స్తున్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త పి. విజయలక్ష్మి మాట్లాడుతూ వెదురు ఆకులు ఔషధాలుగా ఉపయోగపడతాయన్నారు.



జై దుర్గాదేవి

- తొమ్మిదో రోజు వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు
- ఆలయాలు భక్తులతో కిటకిట


దుర్గాదేవీ అలంకరణలో మావుళ్లమ్మ


దుర్గాదేవికి పూజలు చేస్తున్న శ్రీ హరిరాజు దంపతులు


ఉండిలో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ


కరెన్సీ నోట్ల అలంకరణలో కోపల్లె కనకదుర్గమ్మ

భీమవరం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారు భక్తులకు మంగళవారం మూలా నక్షత్రం పురస్కరించుకుని దుర్గాదేవీ దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు మద్దరాల మల్లికార్జునశర్మ సంప్రోక్షణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ సహాయ కమిషనర్ బుద్ధా మహాలక్ష్మీనగేష్ పర్యవేక్షించారు.

● ఆకివీడు : ఆకివీడు పట్టణంలో దుర్గాదేవి అలంకరణలో పెద్దింట్లమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. విజయ థియేటర్ మేనేజింగ్ పార్టనర్ ఎం.శ్రీహరిరాజు దంపతులు పీటలపై కూర్చున్ని పూజలు నిర్వహించారు. పెద్దింట్లమ్మ, వనువులమ్మ దేవస్థానాలతో పాటు గంగానమ్మ-మద్దిరావమ్మ, కనకదుర్గ దేవాలయాల్లో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, దేవస్థానం చైర్మన్ గొట్లా గణపతి, ఈవో అల్లూరి సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.

● ఉండి : ఉండి కాపులపేటలో శ్రీకనకదుర్గమ్మకు యువత ప్రత్యేక పూజలు న్విహించారు. అమ్మవారికి కూరగాయలతో అలంకరణ చేశారు. యండగండిలోని శ్రీసువర్ణదుర్గమల్లేశ్వరి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉండి సంతమార్కెట్‌లో వున్న కనకదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఎన్‌ఆర్‌పీఅగ్రహారం సివిల్ సప్లయిస్ గోడౌన్ వద్ద వున్న కనకదుర్గ అమ్మవారి 28వ వార్షిక నవరాత్రి మహోత్సవములు విజయవంతంగా జరుగుతున్నాయి. హమాలీ వర్కర్స్ వారి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

● కాళ్ల : కాళ్ళ మండలం కోపల్లె గ్రామంలో వున్న కనకదుర్గమ్మ, వరాలమ్మ అమ్మవార్లకు దసరా శరన్నవ రాత్రులను పురస్కరించుకుని మంగళవారం ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుమారు రూ. 5లక్షల కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని అమ్మవార్ల ప్రసాదం స్వీకరించారు.


జీఎస్టీ సంస్కరణలపై ప్రచారం చేస్తున్న టీడీపీ నేత అద్దేపల్లి వాసురాజు

జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు

గణపవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు అన్నారు. మంగళవారం అర్ధవరంలో జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌డీఏ ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణను తీసుకొచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా ఈ జీఎస్టీ తగ్గించడం ద్వారా నిత్యావసరాలు తక్కువ ధరకే లభిస్తాయని స్పష్టం చేశారు. కూటమినేతలు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): తణుకు జాతీయ రహదా రిపై ద్విచక్రవాహనంపై వెళుత్నున్న ఇద్దరు యువకులను సకాలంలో వైద్య సేవలకు అంబులెన్సు ద్వారా పంపించి మానవత్వాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చాటుకున్నారు. మంగళవారం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులను చికిత్స అందించ డంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అధికారులను సమన్వయం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసిన ఆరిమిల్లిని పలువురు వాహనదారులు అభినందించారు.

ఈశ్వరి గోమాతకు సీమంతం



ఆకివీడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు రాజరాజేశ్వరి సహిత మార్కండేశ్వర దేవాలయం ప్రాంగణంలో నిర్వాహకుడు గొంట్లా గణపతి, భక్తులు తదితరులు గోమాత (ఈశ్వరి)కి మంగళవారం ఏడో నెల పురస్కరించుకుని సీమంతం చేశారు. కార్యక్రమంలో మహిళా భక్తులు ఉన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హాలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

అయ్యో.. పాపం!



- ఏలూరులో ముళ్ల పొదల్లో పడి ఉన్న బాలిక
- స్థానికుల సమాచారం.. రక్షించిన పోలీసులు
- మానసిక దివ్యాంగురాలిగా గుర్తింపు
- సమీపంలోని ఆశ్రం ఆసుపత్రికి తరలింపు



పొదల నుంచి బాలికను వెలికి తెస్తున్న డీఎస్పీ, సిబ్బంది, ఆస్పత్రిలో బాలిక

ఏలూరు క్రైం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నోటిలో వేలు పెట్టుకుని ఊఊ అంటూ బిత్తర చూపులు చూస్తున్న బాలిక పరిస్థితి చూస్తే హృదయం ద్రవించిపోతుంది. ఏ తల్లికి జన్మించిన బిడ్డో.. పుట్టుకతోనే మానసిక, శారీరక వైకల్యం ఆ పాపకు శాపంగా మారింది. సుమారు ఐదేళ్ల బాలిక తుప్పల్లో ముళ్ల పొదల మధ్య పడి ఉంది. ఏలూరు ఆశ్రం ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి పక్కన పొదల్లో బాలిక పడిఉన్న సంఘటన కలకలం రేపింది.

ఆశ్రం ఆసుపత్రి రైల్వే బ్రిడ్జి దాటిన తరువాత రహదారి పక్కన ముళ్ల పొదల్లో మంగళవారం సాయంత్రం ఒక బాలిక మూలుగుతున్నట్లు స్థానికులు గమనించారు. దగ్గరగా వెళ్లి పరిశీలించి ఒక్కసారిగా అవాక్కయ్యారు. సుమారు 5 ఏళ్ల బాలిక ముళ్లపొదల్లో నోటిలో వేలుపెట్టుకుని మూలుగుతుంది. ఈ సమాచారం స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావుకు అందడంతో ఆయన వెంటనే ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, సీఐ రాజశేఖర్, దెందులూరు ఎస్ఐ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలిక మానసిక, శారీరక దివ్యాంగురాలిగా గుర్తించారు. సమీపంలోని ఆశ్రం ఆసుపత్రికి తరలించడంతో వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచే బాలిక మూలుగు వినపడినట్లు అక్కడి కార్మికులు చెబుతున్నారు. డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే బాలికను సంరక్షించామని తెలిపారు. ఎవరు తీసుకువచ్చి అక్కడ వదిలిపెట్టారు? కారణాలు ఏమిటి? బాలిక ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు చేపట్టామన్నారు. బాలిక వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలిక సంరక్షణ కోసం ఐసీడీఎస్ అధికారులకు తెలియజేశామన్నారు.

వ్యవసాయ కూలీపై యువకుల దాడి

కామవరపుకోట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రావికంపాడు పంచాయతీలోని నులకానివారిగూడెం సమీపంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న కట్టా నాగమ్మ(50)పై మంగళవారం ఇద్దరు వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను 108 వాహనంపై జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రావికంపాడు పంచాయ తీలోని పాత వెంకటాపురం నుంచి నులకానివారిగూడెం దారి నేపథ్యంలో దాడి చేసినట్లు సమాచారం. తనపై శ్రీను, లక్ష్మణ్ దాడి చేశారని నాగమ్మ పోలీసులకు తెలిపింది.

బహిరంగ సభలు, ర్యాలీలు నియంత్రించాలి

పాలకొల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బహిరంగ సభలు, ర్యాలీలు, సినిమా ప్రమోషన్ కార్యక్రమాలతో అమాయక ప్రజలు బలైపోతున్నారని, వాటిని ప్రభుత్వాలు నియంత్రించాలని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సభలు సమావేశాలు, ర్యాలీలలో ఏవైనా ఘటనలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బహిరంగ సభలు, ర్యాలీలు, సినిమాల ప్రమోషన్స్ కార్యక్రమాల నిర్వహణపై ఘాటైన విమర్శలు చేశారు.

వృద్ధాప్యం వరమే..



ఇంటిల్లిపాది అభ్యున్నతికి జీవితమంతా కష్టపడిన వ్యక్తి ఇప్పుడు ఒక మూల చిన్న గదికి పరిమితమయ్యాడు. ఒక పట్టె మంచం.. ఒక కంచం.. ఒక గ్లాసు.. నెమ్మదిగా తిరిగే ఒక ఫ్యాన్.. అనేక మంది వృద్ధుల జీవన శైలి ఇది. పాత తరంపై కొత్త తరానికి మమకారం పెరగాలి. అప్పుడు వారికి ఆయుర్దాయం పెరుగుతుంది. పిల్లల ప్రేమతో వృద్ధాప్యం వరంగా మారుతుంది. తొలుత 1991 అక్టోబరు 1న ప్రపంచ వ్యాప్తంగా వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

వృద్ధులైన తల్లిదండ్రులకు పిల్లలే కొండంత అండ

ఆప్యాయతతో మరింత ఆయుర్దాయం

పాలకొల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు 60 ఏళ్ల వయసు అంటే వృద్ధాప్యం. ఇప్పుడు మనిషి సగటు ఆయురార్ధం పెరిగింది. 65 పైబడి వయసులో పౌరులు ఆనందంగా జీవించాలంటే వారిని పిల్లలు ఆప్యాయంగా చూడాలి. బాల్యంలో పిల్లలు తల్లిదండ్రులను విడిచి ఉండలేరో. 60 ఏళ్లు పైబడిన తల్లిదండ్రులు కూడా పిల్లల ఆసరా లేకుండా ఉండలేరు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో తల్లిదండ్రులకు పిల్లల ఆసరా కరువైంది. డబ్ల్యుహెచ్‌వో జరిపిన సర్వేలో అధిక శాతం వృద్ధులు అనేక శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. పూర్తి ఆరోగ్యంతో గడుపుతున్న వారి సంఖ్య సుమారు 20శాతం ఉండగా మానసిక ఒత్తిడితో 15 శాతం, అనారోగ్య సమస్యలతో 20 శాతం, బిడ్డల సంరక్షణ కరువై 15 శాతం మంది, కాయకష్టం చేసుకుని వృద్ధాశ్రమంలో జీవిస్తున్న వారి సంఖ్య 30శాతం ఉంది.

వెన్నాడే ప్రాణభయం..

సహజంగా వృద్ధాప్యంలో ఎక్కువ మందిని ప్రాణభయం వెంటాడుతుంది. 60 ఏళ్ల వయసులో ధైర్యంగా ఉన్నా 70 ఏళ్ల వయస్సు వచ్చే సరికి ప్రాణభయం పెరుగుతున్నది. పట్టణవాసం, నగరీకరణ నేపథ్యంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్నాయి. సెల్‌ఫోన్‌లతో పెద్దలతో ఆప్యాయంగా మాట్లాడే వారే లేరు. వృద్ధులను ఆప్యాయంగా చూసుకుంటే ఆయుర్ధాయం పెరుగుతుందని వివిధ సర్వేలు చెబుతున్నాయి.


వృద్ధాప్యంలో కొంత చాదస్తం

పిల్లలకు బాధ్యతలు అప్పగించిన పెద్దలలో అనేక మంది చాదస్తంతో ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు. పిల్లల అవసరాలలో వృద్ధుల అనవసర జోక్యంతో మనస్పర్థలు వస్తున్నాయి. వృద్ధాప్యంలో పిల్లల దిక్కార స్వరం తట్టుకోలేకపోతున్నారు. వృద్ధులు చిన్నపిల్లల మనస్తత్వంతో ప్రవర్తిస్తున్నప్పటికీ యువత అర్థం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రోజులో కనీసం ఒక రెండు గంటలు ఇంటి వద్ద ఉండి తల్లిదండ్రులను ఆప్యాయంగా చూసుకుంటే వారి ఆఖరి దశ ఆరోగ్యంగా ముందుకు వెళ్తుందని నిపుణులు సలహా ఇస్తున్నారు.

నిద్ర దరిచేరదు..

సహజంగా ఏ వయసు వారికైనా చాలినంత నిద్ర దివ్య ఔషధం. వృద్ధులు రోజుకు 8గంటలకు తక్కువ కాకుండా నిద్రిస్తే ఆరోగ్యమని నిపుణులు సూచిస్తున్నారు. వృద్ధాప్యంలో వారి భయాలను పోగొట్టి అభయం ఇవ్వడం ద్వారా ధీమాగా ఉంటారని పరిశీలకులు చెబుతున్నారు.

ఉమ్మడి కుటుంబంతోనే ఆనందం



మా అమ్మ కొప్పరపు వెంకట సుబ్బమ్మకు 94 ఏళ్ల వయసు. నేను చిరు వ్యాపారం చేసుకుంటున్నారు. భార్య పిల్లలు, తల్లితో కలిసి ఉంటున్నాం. భార్య, పిల్లలు కలుపుగోలుగా ఉండడంతో మా తల్లి సంతోషంగా ఉంది. మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ ఆమెను ఆప్యాయంగా చూసుకుంటున్నాం.

- కొప్పరపు సత్యనారాయణ, పాలకొల్లు

వృద్ధులను పిల్లలు ప్రేమగా చూడాలి



పిల్లలు ఎంత విసిగించినా తల్లిదండ్రులు ఓపిగ్గా ఉంటారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు చాదస్తంతో పిల్లలను విసిగించినప్పటికీ అర్థం చేసుకోవాలి. వారిని ఆప్యాయంగా చూసుకోవాలి. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకుంటే సమాజంలో వృద్ధాశ్రమం అవసరమే ఉండదు.

- చేగొండి హరిరామజోగయ్య, మాజీ ఎంపీ

ఉమ్మడి కుటుంబం.. ఒకరికొకరు అండ

ఉమ్మడి కుటుంబంలో ఒకరికొకరు అండగా ఉంటారని యలమంచిలికి చెందిన మేకా శేషారావు చెబుతున్నారు. సమస్యలను కలిసి పరిష్కరించుకోవచ్చు, అన్నివేళల మనం అనే భావన ఉంటుందంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి ఎటువంటి చింత ఉండదని ఆయన అంటారు. శేషారావు, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు, పెద్దకుమారుడు విశ్వేశ్వరరావు, చిట్టిబుల్లెమ్మ దంపతులతో పాటు వారి పిల్లలు, చిన్న కుమారుడు సీతారామాంజనేయులు అంతా కలిసే ఉంటున్నారు.



పిల్లలు, మనుమలతో మేకా శేషారావు దంపతులు

రక్తదానం ప్రాణదానం

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



ప్రజలలో పెరిగిన చైతన్యం

ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు

అత్యవసరమైతే తక్షణ సాయం

ఆకివీడు రూరల్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం అంటే ప్రాణదానం చేయడమే. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, రక్తహీనత, తలసీమియా బాధితులకు రక్తం అవసరం. దాతలు రక్తంతో వేల ప్రాణాలు నిలబడుతున్నాయి. 1975లో ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, ఇమ్యూనో హెమటాలజీ ఆధ్వర్యంలో డాక్టర్ జైగోపాల్‌జాలీ జన్మదినం సందర్భంగా అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహిస్తారు.

రక్తదానంపై ప్రజలలో చైతన్యం వచ్చింది. బంధువులు, కుటుంబ సభ్యులే కాదు, స్నేహితులు రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. సినిమా హీరో అభిమానులు, రాజకీయ నేతల అనుచరులు ముందుకు వస్తున్నారు. కొంతమంది వాట్సాప్ గ్రూపులుగా రక్తదాన కార్యక్రమాలు చేస్తున్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే..

రక్తం దానం చేసేవారి వయసు, బరువు, బీపి, పల్స్, హిమోగ్లోబిన్ లెవెల్స్ నిబంధనలు ప్రకారం ఉండాలి. వయస్సు 18 నుంచి 65 ఏళ్ల మధ్య ఉండాలి, బరువు 45 నుంచి 50కిలోల మధ్య ఉండాలి, హిమోగ్లోబిన్ మహిళలలో 12 గ్రాములు, పురుషులలో 13 గ్రాములుండాలి, పల్స్‌రేట్ నిమిషానికి 50-100 మధ్య ఉండాలి, బీపీ 80-120మధ్యఉండాలి, శరీర ఉష్ణోగ్రత 37.5 ఉండాలని నిబంధనలు తెలియజేస్తున్నాయి.

రక్తం దానంతో లాభాలు

రక్తం దానం వలన మళ్లీ రక్తం ఉత్పత్తితో చురుకుదనం పెరుగుతుంది, గుండె సంబంధ రోగాల ప్రమాదం తగ్గుతుంది. రక్తదానం చేసిన తరువాత ఎర్ర రక్తకణాలు 4 నుంచి 6వారాలలో సాధారణ స్థాయికి చేరుకుంటాయి.

15 వేల మందికి రక్తదానం

అత్యవసర పరిస్థితులలో రక్తం అందించేందుకు నూకల శివ, అల్లాడి రవితేజ కొంతమంది స్నేహితులతో కలిసి మే 1, 2019లోహోప్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. రక్తదాతలను సమీకరించి వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాలలో ఎవరికి రక్తం అవసరమైనా వెళ్లి రక్త దానం చేస్తారు. ఈ గ్రూపులో 300కిపైగా సభ్యులు ఇప్పటి వరకు 15 వేల మందికి రక్తదానం చేశారు. నాలుగేళ్లుగా 40 మంది తలసీమియా బాధిత పిల్లలకు ఒక ప్రైవేటు బ్లడ్ బ్యాంకు సహకారంతో ప్రతి నెల రక్తం అందజేస్తున్నాం.

50 సార్లు రక్తమిచ్చా..



ఒక గర్భిణికి రక్తం అవసరమైతే 26 ఏళ్ల వయసున్న నన్ను అడిగారు. వెంటనే రక్తం అందజేశాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు 50 సార్లు పైగా రక్తదానం చేశాను. సంవత్సరానికి మూడుసార్లు తక్కువ కాకుండా రక్తదానం చేస్తాను.

- భూపతిరాజు శ్రీనివాసరాజు, మోగల్లు

ఈశ్వరి గోమాతకు సీమంతం



ఆకివీడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు రాజరాజేశ్వరి సహిత మార్కండేశ్వర దేవాలయం ప్రాంగణంలో నిర్వాహకుడు గొంట్లా గణపతి, భక్తులు తదితరులు గోమాత (ఈశ్వరి)కి మంగళవారం ఏడో నెల పురస్కరించుకుని సీమంతం చేశారు. కార్యక్రమంలో మహిళా భక్తులు ఉన్నారు.

పేదల పాలిట.. వరం





ఫిజియో థెరపీ కేంద్రంలో సేవలందిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) ఫిజియోథెరపీ సేవా కేంద్రం..

బోళ్ళ వీర వెంకన్న ఫిజియోథెరపీ కేంద్రం

- అతి తక్కువకే సేవలు
- దాతల సహకారంతో వ్యాన్ సౌకర్యం
- సమయ నిబంధనలు లేకుండా సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పలువురు

(తణుకు-ఆంధ్రజ్యోతి)

దాతల సహకారంతోను పేదలకు పలు సేవలందిస్తోందీ ఫిజియోథెరపీ సెంటర్. హెల్పేజ్ ఇండి యా సౌజన్యంతో అంబులెన్సు, చిట్టూరి నరేంద్ర బహూ కరించిన వ్యానును ప్రజలకు వినియోగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులున్న వారి ఇంటికి వెళ్ళి తీసుకొచ్చి ఫిజియోథెరపీ చేయించి తిరిగి ఇంటికి తీసుకెళ్ళే సౌక ర్యం ఏర్పాటు చేశారు. బయట కేంద్రాల్లో శరీరంలో నొప్పులు బట్టి ఆయా ధరలు ఉంటాయి. బయట కేవలం ఒక్క సిట్టింగ్ కోసం రూ. 300 నుంచి రూ. 500 వరకు చార్జీ వసూలు చేస్తారు. అయితే ఇక్కడ కేవలం 120 రూపాయలు చార్జి వేస్తారు. ఎన్ని నొప్పులకైనా, ఎంత సమయమైనా చేయించుకోవచ్చు. ఇక్కడ ఎలాంటి నిబంధనలు ఉండవు. అదే బయట అయితే సమయం ఉంటుంది. దానిని బట్టి ధర కూడా ఉంటుంది.

అందించే సేవలు...


సేవా కేంద్రంలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. అర్హత కలిగిన ఫిజియోథెరపీ వైద్యుడి పర్యవేక్షణలో చికిత్స జరుగుతుంది. ప్రధానంగా ఆర్థరైటిస్, సెరిబ్రల్ పాలసీ, పక్షవాతం, మోకాళ్ళు మెడ, భుజం, నడుం, మడం నొప్పులు, పోస్టు సర్జికల్ కండిషన్స్, బ్యాలెన్స్ ట్రైనింగ్, నరాల నొప్పులు, తిమ్మిర్లు, డయాబెటిక్ న్యూరోపతి, స్పోర్ట్స్ ఇంజ్యురీస్, కండరాల నొప్పులు, డిస్క్ సమస్యలు, స్పాండిలోసిస్ తదితర వాటికి సేవలందించడం జరుగుతుంది.

> పేదల పాలిట వరంగా మారింది తణుకు బ్యాంకు కాలనీలోని బోళ్ళ వీర వెంకన్న ఫిజియోథెరపీ సెంటర్. 2016లో మాజీ ఎంపీ బోళ్ళ బుల్లిరామయ్య ఆర్థిక సాయంతో దీనిని నెలకొల్పారు. నాటి నుంచి అతి తక్కువ ధరకు ప్రజలకు సేవలందిస్తున్నారు.

నెలకు 300 మందికి సేవలు...

ప్రతి రోజూ కేంద్రానికి సుమారు పది మంది వరకు వస్తుంటారు. అలాగే నెలకు 300కు పైబడి రోగులు సేవలందుకుంటారు. ప్రతి నెలా రోగుల నుంచి కేవలం రూ. 24 వేలు మాత్రమే వస్తుంది. అయితే నెలకు ఖర్చు మాత్రం రూ. 41 వేల వరకు అవుతుంది. వైద్యుడికి రూ. 24 వేలు, అసిస్టెంట్‌కు రూ.7 వేలు, వ్యాన్ డ్రైవరుకు రూ. 10 వేలు ఖర్చు అవుతుంది. మిగతా సొమ్ము సంఘం నుంచి వెచ్చించాల్సి ఉంటుంది.

ఈ ఫిజియో థెరపీ సెంటర్‌లో సేవలు పొందుతున్న వారి స్పందన వారి మాటల్లోనే..



సేవా దృక్పథంతోనే నిర్వహిస్తున్నాం

ఈ ఫిజియోథెరపీ సెంటర్ సేవా దృక్పథంతోనే నిర్వహిస్తున్నాం. పేద వర్గాలకు అండగా ఉండాలని భావించాం. అందు కోసం సంఘం తరపున, దాతల సహకారంతో విజయవంతంగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. అందులో భాగంగానే అతి తక్కువ ధరకు సేవలు అందిస్తున్నాం.

-అల్లూరి కరుణాకర్ చౌదరి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

తక్కువ ధరకే సేవలు



తక్కువ ధరకు సంఘం వారు సేవలందిస్తున్నారు. మోకాలు నొప్పితో చాలా కాలం నుంచి ఇబ్బందులు పడుతున్నా. ఇక్కడ అందించే సేవలతో నొప్పులు నయం చేసుకుంటున్నా. బాగా చేస్తున్నారు. చాలా తక్కువ ధరకు సమయంతో నిమిత్తం లేకుండా సేవలందిస్తున్నారు.

-ఎండీ స్వాలిహ్

నొప్పులు తగ్గుతున్నాయి



ఎడమ చెయ్యి నొప్పుతో చాలా కాలం నుంచి బాధపడుతున్నా. బయట సెంటర్లు కన్నా ఇక్కడ చాలా తక్కువ ధరకు సేవలు అందిస్తున్నారు. చాలా కాలంగా ఉన్న నొప్పులు తగ్గుముఖం పడుతున్నాయి. సంఘం అందించే సేవలు మరువలేనివి. పేద వర్గానికి చాలా ఉపయోగంగా ఉంది.

-అర్జి భాస్కరరావు

నడవగలుగుతున్నా..



బిల్డింగ్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయా. ఆ సమయంలో నడవలేని స్థితిలో ఉన్నా. బయట చేయించాలంటే వేలు ఖర్చు చేయాలి. ఇక్కడ అతి తక్కువ ధరకు సేవలందిస్తున్నారు. రెండు నెలలుగా ఇక్కడకు వస్తున్నా. ప్రస్తుతం నడవ గలిగే స్థితికి చేరా. సబ్సిడీపై సేవలు అందించడం చాలా ఉపయోగంగా ఉంది.

- స్వాతి



బేంబూతో తయారు చేసిన సోఫా, కుర్చీలు

వెదురు ఆదాయ వనరు

రూ. లక్ష సబ్సిడీతో రైతులకు 'వెదురు' పెంచే అవకాశం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బేంబో ఈ పేరు వింటే మారేడుమిల్లి.. అరకు తదితర అటవీ ప్రాంతాల్లో లభించే బేంబో చికెన్ గుర్తుకొచ్చే ఉంటుంది. కానీ బేంబో (వెదురు) ఇటు ప్రకృతి వరప్రసాదంతో పాటు రైతులకు మరెంతో ఆదాయం అందించే వనరుగా ప్రసిద్ధి. పూర్వం పంట చేల వద్ద ఈ వెదురు తరచూ కనిపించేది. కానీ ప్రస్తుతం ఆ వెదురు కానరావడం లేదు. ప్రకృతి ముఖ్యంగా వాతావరణ సమతుల్యత దెబ్బతినడం తోపాటు భూభాగం కొట్టుకుపోతోంది. వెదురు అదృష్టంగా స్వచ్ఛమైన గాలి కోసం ఉపయోగిస్తుంటారు. దీన్ని పరిరక్షించేందుకు దీని ఆవశ్యత తెలిపేందుకు ప్రపంచ వెదురు దినోత్సవం ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 18న నిర్వహిస్తున్నారు. ఈ వెదురును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.లక్ష సబ్సిడీ అందిస్తోంది. దీని ద్వారా ఎన్ని లాభాలు ఉన్నాయో తెలుసుకుందాం..

వెదురుతో పచ్చని ప్రకృతి..

వెదురు చెట్ల వల్ల ప్రకృతి ముఖ్యంగా వాతావరణ సమతుల్యత కాపాడుతుంది. దీనికి తోడు భూభాగం వర్షాలకు, వరదలకు కొట్టుకుపోకుండా కాపాడుతుంది. గతంలో బోదె గట్లు, చేల గట్లు, చెరువు గట్ల వెంబడి ఈ వెదురు వేయడం ద్వారా గట్టు పటిష్టత పరిచేవారు. కాల క్రమేనా ప్రస్తుతం ఆ వెదురు చెట్లు ఉండడంలేదు.. చెరువులు కానరావడంలేదు.

వాణిజ్య లాభాలు..

వెదురు వల్ల నిర్మాణ రంగంలో, కాగితం, వస్త్రాల తయారీ, ఔషధాల తయారీ, సంగీత వాయిద్యాల తయారీ, ఫర్నిచర్, ఇతర హస్తకళలకు ఈ వెదురే ఆధారం. వాటితోపాటు ఇళ్లనిర్మాణం కలిగిన వారి ఇళ్ల వద్ద అధిక ధరకు ఈ వెదురు కొనుగోలు సాగిస్తున్నారు. అదే విధంగా వెదురు సోఫాలు, కుర్చీలు, టేబుల్స్ ఇతర ఫర్నిచర్ తయారీలో వినియోగిస్తున్నారు. వెదురు ఔషదాల తయారీలో ఉపయోగిస్తుంటారు. .

బేంబూ నర్సరీ కోసం సబ్సిడీ

వెదురు విత్తనాలు వేసుకుని వెదురు పెంచడంతోపాటు విక్రయించడానికి ఆసక్తిగల యువత కోసం ప్రభుత్వం లక్ష సబ్సిడీతో అంది స్తోంది. దీనికి ఆసక్తిగల యువతకు ఉద్యాన విశ్వ విద్యాలయ పరిధిలో శిక్షణ అంది స్తున్నారు. కేవికే ప్రధాన శాస్త్రవేత్త పి. విజయలక్ష్మి మాట్లాడుతూ వెదురు ఆకులు ఔషధాలుగా ఉపయోగ పడతా యన్నారు.






తమిళనాడు ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట

టీవీకే పార్టీదీ బాధ్యత ఉంది : ఎంపీ పుట్టా



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ మహేశ్

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో టీవీకే పార్టీ, తమిళనాడు ప్రభుత్వం వైఫల్యం కారణంగానే ర్యాలీలో తొక్కిసలాట జరిగినట్టు స్పష్టంగా కనిపిస్తోందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని సోమవారం ఎన్డీఏ ఎంపీల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందంలో సభ్యుడైన పుట్టా మహేశ్ కుమార్ మాట్లాడుతూ బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించినప్పుడు ఎంతో ఆవేదన కలిగిందన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు, కొత్తగా పెళ్లైన జంటలు ఉండటం మనసును కలచివేసిందన్నారు. ఎన్డీఏ బృంద కన్వీనర్ హేమామాలినితో పాటు సభ్యులంతా కలిసి నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.



ప్రజా వైద్యుడు పీఎల్‌వీ ప్రసాద్ : బొలిశెట్టి




విద్యార్థినులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రజా వైద్యుడు దివంగత డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ అని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. దివంగత డాక్టర్ పీఎల్‌వీ ప్రసాద్ జయంతి వేడుకలు మంగళవారం స్థానిక ఆసుపత్రి వద్ద నిర్వహించారు. తొలుత ప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కొయంబత్తూరులో నిర్వహించిన పోటీలో రన్నర్స్‌గా నిలిచిన కొండ్రెడ్డి రాధ, పోతుల నవ్య అనే విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శోభారాణి, డాక్టర్ శ్రీనివాస్, కూటమి నాయకలు మైలవరపు రాజేంద్రప్రసాద్, ముత్యాల ఆంజనేయులు, అడ్డగర్ల సూరి, నల్లగంచు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.









కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి

» 73 మందికి రూ.35 లక్షల చెక్కుల పంపిణీ : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని ప్రతీ ఒక్కరూ ఆశీర్వదించాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి నియోజక వర్గంలోని పేదలు వైద్య ఖర్చుల నిమిత్తం 73 మందికి రూ.35 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. గతంలో జగన్ పాలనలో సీఎంఆర్ఎఫ్ నిధులను సైతం పక్కదారి పట్టించారన్నారు. పేదలకు వైద్యం దూరం చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో పాలకొల్లు నియోజకవర్గంలో రూ7.5 కోట్లు పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందజేయడం జరిగిందని మంత్రి నిమ్మల వివరించారు.ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బి సోమశేఖర్, ఎం ఫకీర్ బాబు, వట్టం గణేష్, తులా రామలింగం, శిడగం సురేంద్ర, కొమ్ముల దినేష్, పినిశెట్టి శ్రీనివాస్, విన్నకోట గోపి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి ప్రణాళిక బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి, కలెక్టర్ నాగరాణి

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించాలి

» ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల వినియోగంపై సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి బాటలో పయనించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుతీరు, నిధులు వినియోగం మెరుగుపర్చడం ద్వారా జిల్లా అభివృద్ధి చెందడం వంటి విషయాలపై చర్చించామన్నారు సమావేశంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

'ఐజేయూ'కి సహకారం అందిస్తా

» రాజకీయ విశ్లేషకుడు పెంటపాటి పుల్లారావు



సోమసుందర్‌ను అభినందిస్తున్న డాక్టర్ పెంటపాటి పుల్లారావు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయూ) చేస్తున్న కృషికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ప్రముఖ సామజికవేత్త, రాజకీయ విశ్లేషకుడు పెంటపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. ఐజేయూ జాతీయ కార్యదర్శిగా డి.సోమసుందర్ మంగళవారం న్యూఢిల్లీలో భేటి అయ్యారు. ఆగస్టులో జరిగిన ఐజేయూ ఎన్నికల్లో డి.సోమసుందర్ సెక్రటరీ జనరల్ ఎన్నికైన విషయం తెలిసిందే. యూనియన్ పనిపై ఢిల్లీ వెళ్లిన అతనిని సామాజికవేత్త పుల్లరావు ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఊదు దశాబ్దాలుగా సోమసుందర్ పత్రికా రంగానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో ఆయన సేవలు వినియోగించుకోవాలని జర్నలిస్టులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు ఎస్‌కే అప్తర్‌అలీ, షేక్ లాల్‌బీబీ, పి.రాధారాణి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత నాగేశ్వరరావు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

ఇరగవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కె.ఇల్లిందలపర్రు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పెరుమాళ్ళ నాగేశ్వరరావు (65) అనారోగ్య కారణంగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన నివాసంలోని భౌతికాయానికి కూటమి నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ గెలుపునకు ఆయన అందించిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.





'జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం'

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ తగ్గింపు చేసిందని ఎంపీడీవో ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' కార్యక్రమం సర్పంచ్ మద్దుకూరి గంగాభవాణి ధనరాజు అధ్యక్షతన నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ఏఏ వస్తువుల ధరలు తగ్గాయో జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తణుకు పట్టణ అధ్యక్షురాలిగా వరలక్ష్మి

తణుకు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణ కాంగ్రెసు పార్టీ అధ్యక్షురాలిగా చుక్కాకులు వరలక్ష్మి, మండల అధ్యక్షుడిగా పెనుమత్స రామకృష్ణంరాజును మంగళవారం నియోజవర్గ ఇన్‌చార్జి దర్శిపో రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇరువురికి నియామక పత్రాలను కాంగ్రెసు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరిని పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

5న ఆర్‌టీసీఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా మహాసభలు

తణుకు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీఎస్ డబ్ల్యూఎఫ్ జిల్లా మహాసభలు తణుకులో ఐదో తేదీన జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు టి.వి.ఎస్.మూర్తి మంగళ వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహాసభలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు.







తాడేపల్లిగూడెంలో మహాదుర్గగా గాయత్రి మాత
వనదుర్గగా బలుసులమ్మ



తాడేపల్లిగూడెంలో దుర్గాదేవి అలంకరణలో విశ్వదుర్గేశ్వరి.. ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు



కొమ్ముగూడెంలో చల్లాలమ్మ ఆలయ ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన

జై దుర్గాదేవి



వీరంపాలెంలో సిద్ధి ధాత్రిగా బాలాత్రిపుర సుందరి



తాడేపల్లిగూడెంలో కనకదుర్గగా వాసవీమాత

» తొమ్మిదో రోజు వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు » ఆలయాలు భక్తులతో కిటకిట

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు మంగళవారం పలుచోట్ల అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరణ చేసి భక్తులకు దర్శమిచ్చారు. తాడేపల్లిగూడెం పురదేవత బలుసులమ్మను వనదుర్గగా అలంకరించారు. పట్టణంలోని ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు. వీకర్స్‌కాలనీలో ఉన్న గాయత్రి మాతను మహాదుర్గాదేవిగా అలంకరించారు. వాసవీ పంచాయతన క్షేత్రంలో ఉన్న వాసవీ మాతకు కనకదుర్గ అలంకరణ చేశారు. ఏలూరు రోడ్డులో ఉన్న మహంకాళమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి హోల్‌సేల్ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. తాడేపల్లిగూడెంలోని 17వ వార్డు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో విశ్వదుర్గేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పూజలలో భాగంగా మంగళవారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అనంతరం నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. భైరాగిమంఠం గోపాలస్వామి అంజనేయస్వామి ఆలయంలో జరగుతున్న వేడుకలలో భాగంగా ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఈవో చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

● వీరంపాలెం శ్రీ బాలాత్రిపుర సుందరి దేవి పంచాయతన క్షేత్రంలో అమ్మవారికి సిద్ధిధాత్రి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రెవెన్యూ కార్యదర్శి జయలక్ష్మి గోపినాద్ దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్లవెంకట రమణ సిద్ధాంతి పర్యవేక్షించారు. ముత్యాలంబపురం ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కొమ్ముగూడెంలో చల్లాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆరుగొలను విజయదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారికి దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

●తణుకు రూరల్ : తణుకు మండలంలోని పలు దేవాలయాల్లోని అమ్మవార్లను దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు పూజలు నిర్వహించారు. దువ్వ గ్రామంలోని దానేశ్వరి అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద భవానీ భక్తులు నిప్పుల గుండం తొక్కే కార్యక్రమం నిర్వహించారు. మండపాక గ్రామంలోని శ్రీ యల్లారమ్మ ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

●అత్తిలి : అత్తిలి మండలంలో గల అమ్మవార్ల ఆలయాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా దుర్గాష్టమి రోజున అమ్మవారిని కనకదుర్గగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. భవానీలు జ్యోతులతో ఊరేగింపు ఉత్సవాన్ని నిర్వహించారు.



గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

మానవత్వం చాటిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): తణుకు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులను సకాలంలో వైద్య సేవలకు అంబులెన్సు ద్వారా పంపించి మానవత్వాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చాటుకున్నారు. మంగళవారం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులను చికిత్స అందించడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అధికారులను సమన్వయం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసిన ఆరిమిల్లిని పలువురు వాహనదారులు అభినందించారు.

వేధింపు బాధితులకు న్యాయం చేసేందుకే డిజిటల్ బుక్ : కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వేధింపులకు గురైన వారికి న్యాయం చేసేందుకే వైసీపీ అధినేత జగన్ డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని అయన నివాసం వద్ద మంగళవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్యాయంగా అక్రమంగా తప్పుడు కేసులు బనాయించిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. తాడేపల్లిగూడెంలో కూటమి పాలన దిగజారిపోయిందని విమర్శించారు. జూదాలు, విచ్చల విడి మద్యం, గంజాయి, రౌడీయిజంతో నియోజకవర్గంలో అవినీతిమయంగా మారిందని విమర్శించారు. వైసీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, జడ్డు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శేరేపాలెంలో చోరీపై కేసు నమోదు

మొగల్తూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శేరేపాలెం గ్రామంలో ఒక గృహంలో జరిగిన చోరీపై కేసు నమోదు చేశామని మొగల్తూరు ఎస్ఐ జీ.వాసు తెలిపారు. గ్రామానికి చెందిన తణుకుల సోమేశ్వరరావు తన కుమారుడు వివాహం పురస్కరించుకుని సెప్టెంబరు 27వ తేదీ రాత్రి భీమవరానికి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. 28వ తేదీ ఉదయం ఇంటికి వచ్చే సరికి మూడు కాసుల బంగారం, కిలోన్నర వెండి వస్తువులు, రూ.లక్ష నగదు దొంగతనానికి గురైనట్టు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి లూసీ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇరువురు వ్యాధిగ్రస్తులకు లూసీ చారిటబుల్ ట్రస్ట్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించినట్లు ట్రస్ట్ ఎం.యోషయా, డైరెక్టర్ ఎం.రాజేష్ తెలిపారు. రుస్తుంబాదకు చెందిన గొలుసు రాముకు, కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన మొండి జ్ఞానేశ్వరరావు అనే వృద్ధుడికి ట్రస్టు ద్వారా ఇరువురికి రూ.10వేలు చొప్పున మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి అందించారు. ట్రస్టు సభ్యులు కట్ట సుధాకర్, ఎం.విజయ కుమార్, కె.ఏసు రత్నం ఉన్నారు.


చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి నిమ్మల, కూటమి నాయకులు

కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి

▸ 73 మందికి రూ.35 లక్షల చెక్కుల పంపిణీ : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని ప్రతీ ఒక్కరూ ఆశీర్వదించాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి నియోజకవర్గంలోని పేదలు వైద్య ఖర్చుల నిమిత్తం 73 మందికి రూ.35 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. గతంలో జగన్ పాలనలో సీఎంఆర్ఎఫ్ నిధులను సైతం పక్కదారి పట్టించారన్నారు. పేదలకు వైద్యం దూరం చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో పాలకొల్లు నియోజకవర్గంలో రూ7.5 కోట్లు పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందజేయడం జరిగిందని మంత్రి నిమ్మల వివరించారు.ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బి సోమశేఖర్, ఎం ఫకీర్ బాబు, వట్టం గణేష్, తులా రామలింగం, శిడగం సురేంద్ర, కొమ్ముల దినేష్, పినిశెట్టి శ్రీనివాస్, విన్నకోట గోపి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందిస్తున్న విప్ బొమ్మిడి నాయకర్

పార్టీలకు అతీతంగా 'సీఎం సహాయ నిధి'

నరసాపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి); పార్టీలకు అతీతంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుని, బిల్లులు పెడుతున్న రోగులందరికీ సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి సాయం అందిస్తున్నట్టు ప్రభుత్వ విప్ నాయకర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల్ని లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వలవల నాని, చిన్నరాజ్. విజయలక్ష్మి, తిరుమాని నాగరాణి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై ఎగిసిపడిన మంటలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌రోడ్డు డైలీ మార్కెట్ సమీపంలోగల రామాలయం వద్ద ఉన్న విద్యుత్ స్తంభంపై సోమవారం రాత్రి పది గంటలు దాటిన అనంతరం ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సత్వరమే స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఫైర్ ఆఫీసర్ వై.జానకీరామ్ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్‌శాఖ ఏఈ బాబ్జి, సిబ్బంది తెగిపోయిన వైర్లను సరిచేయించారు. సుమారు రూ.20 వేలు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కేబుల్ వైర్లు కాలిపోయాయి. రాత్రి సమయంలో ఈ ఘటన జరగడంతో ప్రాణ నష్టం జరగలేదని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


విద్యుత్ వైర్లను సరి చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

అమ్మా.. దుర్గమ్మా..


తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయంలో కుంకుమ పూజలు


జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెంలో విశేష అలంకరణలో అమ్మవార్లు


జీలుగుమిల్లిలో అమ్మవారి ఆలయంలో చిన్నారులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సామూహిక కుంకుమ పూజలు, సహస్ర నామార్చన నిర్వహిస్తున్నారు. పలుచోట్ల వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గా దేవీ అమ్మవారుగా దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన అర్చకులు మద్దరాల మల్లికార్జునశర్మ సంప్రోక్షణ చేసి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరాలయంలో పార్వతీదేవి, పెనుగొండ వాసవీ మాత దుర్గాదేవిగా భక్తులను కరుణించారు. తాడేపల్లిగూడెం బలుసులమ్మ వన దేవతగా దర్శనమిచ్చారు.

ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మ మంగళవారం భక్తజనులకు శ్రీదుర్గాదేవిగా దర్శనభాగ్యాన్ని కల్పించారు. సింహ వాహనాన్ని అధిరోహించి, అష్టభుజాలతో, ఆయుధ ధారిణియై, ఉగ్రరూపంలో ఉన్న కుంకుళ్లమ్మను పలువురు భక్తులు దర్శించి తరించారు. ఉగ్రరూపంలో ఉన్నా భక్తులపై కరుణ కురిపించే అమ్మను దర్శిస్తే దుర్గతుల నుంచి తప్పించుకోవచ్చన్నది భక్తుల నమ్మకం.


దుర్గాదేవిగా దర్శనమిచ్చిన భీమవరం మావుళ్లమ్మ, ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, ఏలూరులో విశ్వేశ్వర స్వామి దేవాలయంలో మహాదుర్గాదేవి.. విశేషాలంకరణలో పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ, కాళ్ల మండలం కోపల్లెలో ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు, వనదుర్గగా దర్శనమిచ్చిన తాడేపల్లిగూడెం బలుసులమ్మ


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

'ప్రతీ ఇంటికి జీఎస్టీ ఫలాలే ప్రభుత్వాల లక్ష్యం'

పెనుమంట్ర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ ఫలాలు ప్రతి ఇంటికి అందించాలన్నదే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం పెనుమంట్ర మండలం ఆలమూరులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన వెలమ, శెట్టిబలజ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు భూపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ సర్కార్ వేగంగా అభివృద్ధి సంక్షేమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. దైనందన జీవితంలో కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీని కొంత తగ్గించడం కొన్నింటిలో పూర్తిగా తొలగించారని దీని కారణంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. శెట్టిబలిజ రామాలయంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడపరెడ్డి వెంకటరమణ, ఎంపీటీసీ పలివెల ఆశాలత. ప్రేమ్‌కుమార్, టీడీపీ నాయకులు కడలి ఏడుకొండలు, నూర్ సాహెబ్ దూదేకుల రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ అలీ జిన్నా, వెలగల బుల్లి రామిరెడ్డి, టీడీపీ మండల కార్యదర్శి గూడూరి మురళి, జనసేన మండల అధ్యక్షుడు కొయ్య కార్తీక్, వెంకటలక్ష్మి, ఇందుకూరి నరసింహరాజు, కర్రి అయ్యప్పరెడ్డి, తేతల రామారెడ్డి, గుర్రి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేజేబీవై బీమా చెక్కు పంపిణీ

ఆచంట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ కింద సంవత్సరానికి రూ.436 చొప్పున ప్రీమియం చేసుకుంటే చనిపోయిన వ్యక్తికి రెండు లక్షలు రూపాయల ఇన్సూరెన్స్ ఉంటుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజరు బి.విజయకుమార్ అన్నారు. మంగళవారం ఆచంట ఎస్‌బీఐలో పలువురికి ఇన్సూరెన్స్ చెక్కులు సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఇన్సూరెన్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడించారు. అనంతరం పెనుమంచిలికి చెందిన సీహెచ్ సుధీర్‌బాబు గుండెపోటుతో ఇటీవల మృతి చెందడంతో అతడి భార్య శాంతకుమారికి ఇన్సూ రెన్స్‌కు సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆచంటకు చెందిన కౌన్సిలర్‌లు డి బెనర్జి, పి.సుధీర్‌కుమార్, తరపట్ల శ్రీను పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాలకొల్లు
ఆచంట, పాలకొల్లు, నరసాపురం
5 www.andhrajyothy.com ● బుధవారం 1 అక్టోబరు 2025

'విగ్రహ పునఃప్రతిష్ఠకు గ్రామస్థులంతా సహకరించారు'

మొగల్తూరు, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ, ప్రాయశ్చిత హోమాల నిర్వహణకు గ్రామస్థులంతా పూర్తిగా సహకరించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల పాటు గ్రామ పరిధిలోని అన్ని కులాలు, మతాల ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించారన్నారు. సుమారు 15వేల మంది అన్నసమారాధనలో అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారన్నారు. భక్తులు విరాళాలు, సేవల రూపంలో సహకరించినందరికి కృతజ్ఞతలు తెలిపారు.



శేరేపాలెంలో దుర్గమ్మకు పూజలు
మొగల్తూరులో దుర్గమ్మకు పూజలు


శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవిగా పార్వతీ దేవి


పాలకొల్లులో వాసవీ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నవ దుర్గదేవి అలంకరణలో వాసవీ మాత


దుర్గాదేవిగా పెదమల్లం మాచేనమ్మ


దుర్గాదేవిగా ఆచంట పార్వతి అమ్మవారు


పెనుగొండలో దుర్గాదేవిగా వాసవీ మాత

జై దుర్గాదేవి

తొమ్మిదో రోజు వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు ▸ ఆలయాలు భక్తులతో కిటకిట

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : శరన్నవ రాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాలు, ఆలయాల్లో శరన్నవరాత్రుల వేడుకలు వైభవంగా జరిగాయి. క్షీరా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రాత్రి అమ్మవారిని దుర్గాదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

● యడ్లబజారులోని కనక దుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవిగా అలంకరించారు. ఈవో ఎన్.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో అర్చకులు ఎం. వెంకటరమణ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సిబ్బంది చిట్టి రాంబాబు, సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

● వాసవీ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో చిన్నగోపురం వీధిలోని కల్యాణ మండపంలో అమ్మవారిని నవదుర్గలుగా ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణం చేశారు. వాసవీ సంఘ సభ్యులు పాల్గొన్నారు. 24వ వార్డులోని శంభేశ్వర స్వామివారి ఆలయంలోనూ, రత్నామాంబ దేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

● నరసాపురం/మొగల్తూరు : దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం నరసాపురం పట్టణ, మండలంలోని దుర్గమ్మ ఆలయాలతో పాటు పలు కూడళ్ళు, గ్రామాల్లో నిలబెట్టిన అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగల్తూరు భవానీ కాలనీ దుర్గమ్మ అమ్మవారు, పార్వతీదేవి, పేరుపాలెం రజకులపేట దుర్గమ్మ, కేపీపాలెం జలదుర్గమ్మ, రామన్నపాలెం ప్రసన్న కనదుర్గ ఆలయాలతో పాటు శేరేపాలెం, కూరగా యల మార్కెట్, కోట, పడమటిపాలెం, కుక్కల వారితోట, సత్రపాలెం, గుంట, గరువు పల్లవ పాలెం గ్రామాల్లో నిలబెట్టిన దుర్గమ్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన దద్దోజనం, గారెలు, చిట్టి కాజాలు నివేదన చేశారు.

● ఆచంట/పెనుగొండ : దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆచంటలోని పెదమల్లం మాచేన మ్మ వారు ఆచంటలో పార్వతి అమ్మ వారు దుర్గా దేవిగా దర్శనమిచ్చారు. పెనుగొండ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు.


తగ్గిన ధరలపై అవగాహన కల్పిస్తున్న పొత్తూరి, కొవ్వలి

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం

నరసాపురం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి); జీఎస్టీ తగ్గుదలతో అన్ని వస్తువులు ధరలు తగ్గుముఖం పడుతున్నాయని, ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు అన్నారు. మంగళవారం చిట్టవరం గ్రామంలో జీఎస్టీ తగ్గుదలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు దిశగా కూటమి ప్రభుత్వ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, కొప్పినీడి వాసు, పోలిశెట్టి సాంబ తదితరులు పాల్గొన్నారు.